కథ

ప్రఫుల్ల చంద్ర

# ప్రేమ ఒయాసిస్

''నమస్తే మేడమ్!''

ఎక్స్‌రే పరిశీలిస్తున్న డాక్టర్ నీహారిక వెనక్కి తిరిగి గుమ్మం వైపు చూసింది. చేతికర్ర ఆసరాగా నిలబడి ఉన్న ఒంటికాలు, ఒంటి చెయ్యిమనిషి!

''ఒంటి చేతితో నమస్కరిస్తున్నందుకు క్షమించాలి. బయట స్ట్రెచర్ మీద నిండు గర్భిణి విలవిలలాడుతోంది. కాస్త చూడండి మేడమ్''

అతని స్వరం చిరపరిచితం అయినట్లు అతడ్ని ఎప్పుడో చూసినట్లు అనిపించింది డాక్టర్‌కి. ఒంటికాలుతో గెంతుతూ అతడు స్ట్రెచర్ వద్దకు వెళ్లగా అనుసరించిన నీహారిక గర్భిణిని పరీక్షించి ఇంజెక్షన్ ఇచ్చింది.

ఆమెను ప్రసూతి వార్డులో అడ్మిట్ చేయమని నర్స్‌కి చెప్పి తన గదిలోకి వెళ్లిన డాక్టర్‌ని అనుసరించాడు అతడు.


''ఎంతమంది పిల్లలు?'' అడిగింది డాక్టర్.

''నలుగురు...కాబోలు'' అన్నాడు బుర్రగోక్కుంటూ.

చిర్రెత్తుకొచ్చిందామెకు ''కాబోలు అంటున్నావ్! ఎంతమందిని కన్నావో నీకే తెలియదా? తాగుతావా? కుటుంబ నియంత్రణ అనే మాట వినలేదా? ఐదుగురు బిడ్డల్ని ఎలా పోషిస్తావయ్యా? నీ భార్య చాలా నీరసంగా ఉంది. మరో కాన్పు అయితే ఆమె ప్రాణాలకే ముప్పు. జాగ్రత్త!'' చెడామడా వాయించింది.

ఆమె మందలిస్తుంటే అతనికి బాధ కలగలేదు. పైగా నవ్వేస్తూ ''సిజేరియన్ అవసరం అవుతుందేమో. ఆరువేల కంటే ఎక్కువ ఇవ్వలేను'' అన్నాడు డబ్బు టేబుల్ మీద పెడుతూ.

అతని నవ్వు చూసి మరింత కోపం వచ్చిందామెకు. ''పెళ్లాం ప్రాణం మీదకొచ్చేసరికి డబ్బు ఇవ్వడానికి సిద్ధపడ్డావ్. ఆమె గర్భవతి అయినప్పటి నుంచి ఆ డబ్బు ఖర్చుపెట్టి మంచి



ఆహారంఇస్తూ నెలనెలా చెకప్ చేయించి మందులిప్పిస్తే ఇప్పుడీ పరిస్థితి వచ్చేది కాదు కదా! సిజేరియన్‌కి ఆరువేలు కాదు పదిహేను వేలు!'' అంది గుర్రుగా.

''మీరు బీదలపాలిట దేవత! డబ్బు ఇవ్వకపోయినా జబ్బు నయం చేస్తారు. ఆపరేషన్లూ ఫ్రీగానే చేస్తారని నాకు తెలుసు మేడమ్!'' గలగలా నవ్వేశాడు. ఆమెకూ నవ్వొచ్చింది - కానీ ఆపుకుంది.

కష్టాలు, కన్నీటితో అతని ముఖం రాటుదేలి రఫ్‌గా కనిపిస్తున్నా నవ్వు మాత్రం పాలసముద్రంలా హాయిగా ఆత్మీయంగా ఉంది.

''నేను ఫ్రీగా వైద్యం చేస్తానన్న ధైర్యంతో జీతం అంతా తాగేస్తున్నావా?'' అని అడిగింది.

''లేదు మేడమ్! నేను తాగను'' అంటూ వెళ్లిపోయాడు.

ఆ గర్భిణికి సంబంధించిన వివరాలు రాసిన కాగితం తెచ్చి ఇచ్చింది నర్స్.

ఆమె పేరు పార్వతి. భర్త రామారావు. సిరమిక్ ఫ్యాక్టరీలో కళాసీ. జీతం ఐదువేలు. నలుగురు పిల్లలు.

''ఐదువేలు జీతగాడికి ఐదో బిడ్డ! ఛీ..ఛీ! వీళ్లకి బుద్ధి లేదు, రాదు'' అని దీర్ఘంగా నిట్టూర్చి అతడిచ్చిన ఆరువేలు అతనికే ఇచ్చేయాలనుకుంది నీహారిక.

చటుక్కున ఆమె భర్త జగదీశ్ వచ్చి లటుక్కున టేబుల్ మీదున్న డబ్బు జేబులో పడేసుకొని ''నాకొక కిడ్నీ కావాలి డార్లింగ్! పార్వతికి ఎలాగూ సిజేరియన్ చేస్తావుగా. అప్పుడు దాని కిడ్నీ తీసి ఇచ్చేయ్. నాడు డబ్బు చాలా అవసరం'' అన్నాడు.

అతని మాట ముగిసీ ముగియకుండానే సర్రున అతని జేబులోని డబ్బు లాక్కుని ''తక్షణం బయటకు పో! లేకుంటే సెక్యూరిటీతో గెంటిస్తాను'' అని గర్జించింది నీహారిక.

ఆమె రౌద్రాకారం చూసి హడలిపోయిన జగదీశ్ కిక్కురుమన

కుండా ఇంటికి వెళ్లిపోయాడు.

★ ★ ★

విజయవాడలోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో నీహారిక, జగదీశ్ డాక్టర్లుగా పనిచేసేవారు. జగదీశ్‌కి డబ్బు యావ తప్ప వృత్తి నిబద్ధత లేదు. ఒక రోగి కిడ్నీ కాజేసి అమ్ముకున్నాడు. గుట్టు రట్టు కాగా అతడు మరెక్కడా ప్రాక్టీస్ చేయడానికి వీల్లేకుండా అతని సర్టిఫికెట్‌ని కేన్సిల్ చేసింది మెడికల్ కౌన్సిల్. దాంతో విజయవాడ విడిచిపెట్టి ఒక పట్నంలో 'సుఖీభవ' అనే పేరుతో నర్సింగ్ హోమ్ ప్రారంభించిన నీహారిక మంచి డాక్టర్‌గా పేరు సంపాదించుకుంది.

అయితే జగదీశ్ సుఖీభవను హైజాక్ చేసి తనే పెత్తనం చేయడం, ఫీజులు వసూలుచేసుకోవడం, రోగులకు వైద్యం చేయడం చూసి సహించలేక నీహారిక ఎన్నోసార్లు హెచ్చరించినా అతడు పట్టించుకోలేదు. అయితే ఈ రోజు అమీతుమీ తేల్చుకోవాలని గట్టిగా తీర్మానించుకొని సెంట్రీ చేత మెడపట్టి గెంటిస్తానని గర్జించింది. ఆసుపత్రి పని పూర్తయ్యాక ఇంటికెళ్లి భర్తమీద తీవ్రంగా విరుచుకుపడింది.

''సుఖీభవలో నువ్వు పెత్తనం సాగిస్తే నా సర్టిఫికెట్ కూడా ఊడుతుంది. ఇద్దరం ముష్టెత్తుకోవాలి! నీ కార్యక్రమాలకు ఈ టౌన్ సరిపోదు. మీ మామగారింటికి పోయి ఆయన్ని పీక్కు తిను. విజయవాడలో అయితే నీకు కావల్సిన నైట్‌క్లబ్బులు, నైట్ క్వీన్‌లూ, మందూ ధారాళంగా దొరుకుతాయి. అక్కడికే పో! నువ్వు మళ్లీ సుఖీభవలో అడుగుపెడితే విడాకులకు దరఖాస్తు చేసి నిండుకోర్టులో నీ బండారం బయటపెడతా జాగ్రత్త!'' అని రంకెలేసింది.

జగదీశ్ ఆలోచనలో పడ్డాడు.

పెళ్లయిందన్న మాటే గానీ శోభనం జరగనే లేదు. భార్య వేరే పడుకుంటోంది. దగ్గరకు రానివ్వడం లేదు. తిండి పెట్టి డబ్బు ఇస్తోంది. అదే చాలు. ఆనందం ఎక్కడైనా కొనుక్కోవచ్చని సరిపెట్టుకుంటున్నాడు. అయితే ఆమె ఇచ్చేది వందలూ, వేలూ మాత్రమే. మామగారి వద్దకు పోయి హైదరాబాద్‌లో మందుల పంపిణీ కంపెనీ ప్రారంభిస్తానని చెప్పి లక్షలు గుంజవచ్చు. ఆ మందుల మాటున మాదకద్రవ్యాలు పంపిణీ చేస్తే కోట్లు కురుస్తాయి. భార్య ఇచ్చే వేలు కన్నా కోట్లు నయం కదా!

అంతే. సూటుకేసు సర్దుకొని జగదీశ్ వెళ్లిపోయాడు మామగారింటికి.

★ ★ ★

టౌన్‌లో ఉన్న సిరమిక్ కంపెనీ ఉద్యోగులు చాలామంది వైద్యం కోసం సుఖీభవకు వస్తూ ఉంటారు. కొందరు ఇన్‌పేషెంట్లుగా చేరుతూ ఉంటారు. వారి యోగక్షేమాలు విచారించడానికి కంపెనీ లైజన్ ఆఫీసర్ మంజు తరుచుగా నర్సింగ్ హోంకి వచ్చి నీహారికతో మాట్లాడుతూ ఉంటుంది.

పార్వతికి సిజేరియన్ అయిన రోజు ఆమె అత్తగారు వచ్చిందిగానీ తప్పతాగి ఎక్కడ పడిపోయాడో రామారావు రాలేదు. బాధ్యతారహితుడు, తాగుబోతు, అవిటివాడు అయిన వ్యక్తికి కళాసీ ఉద్యోగం ఎలా ఇచ్చారని ఆ రోజు సుఖీభవకొచ్చిన మంజుని అడిగింది నీహారిక.

''రామారావు డ్యూటీలో ఉన్నప్పుడు తాగడు. పని సక్రమంగానే చేస్తాడు. మీరు పొరపడ్డారు. ఒంటికాలు మనిషి రామారావు కాదు, చంద్రమోహన్. పదివేలు జీతం మీద మేస్త్రీగా పనిచేస్తున్నాడు. పరోపకారి పాపన్న! జీతంలో సగం తన కంటే దురదృష్టవంతుల కోసం ఖర్చుపెడుతూ చేతనైన సాయం చేస్తూ ఉంటాడు. ప్రసూతి నొప్పులతో పార్వతి బాధపడుతూ భర్త ఆచూకీ తెలియక ఆందోళన పడుతోంటే అతడే ఆమెను తీసుకొచ్చి మీ ఆసుపత్రిలో చేర్పించాడు. మీకిచ్చిన ఆరు వేలు అతనిదే.'' మంజు చెబుతోంటే ఆశ్చర్యంగా వింటూ ఉండిపోయింది నీహారిక.

చంద్రమోహన్ పేరు వినగానే ఆమె గుండెల్లో జ్ఞాపకాల గంటలు మోగాయి. అవ్యక్త భావాలేవో ఉక్కిరిబిక్కిరి చేశాయి.

'అతన్ని కలవాలి.. కలవాలి' అంది కలవరిస్తున్నట్లు.

అయితే చంద్రమోహన్ రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ సెలవు పెట్టి ఇంటిలోనే ఉన్నాడని చెప్పింది మంజు. ఇద్దరూ అతనింటికి వెళ్లారు.

అతడు పెళ్లి చేసుకోలేదు. ఇంటిలో ఎవరూ లేరు. అతడు మాత్రం తీవ్రమైన జ్వరంతో వణకిపోతూ మంచంమీద పడి ఉన్నాడు. నాడి, నాలుక, కళ్లు పరీక్షించి ఇంజెక్షన్ ఇచ్చింది నీహారిక. మంజు ఆఫీసుకి వెళ్లిపోగా తలుపు మూసి అతని వద్దకొచ్చింది నీహారిక.

జ్వరంతో, బాధతో సగం మగతలో మూలుగుతున్న అతన్ని

## అక్కడ కలిసొచ్చింది

**తెలుగులో స్వప్నమాధురిగా కొన్ని సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో నటించినా కూడా ఇక్కడ తన కెరీర్ అంతగా బాలేదనే ఉద్దేశంతో తన పేరును మధుమితగా మార్చుకుని తమిళ రంగంలోకి అడుగు పెట్టింది. అక్కడామెకి అదృష్టం కలిసొచ్చి ఇప్పుడు బిజీ హీరోయిన్‌గా మారిపోయింది. ఎంత బిజీ అయిపోయిందంటే- ఇక తను ఇంకొంత కాలం ఇక్కడే హీరోయిన్‌గా రాణించగలననే నమ్మకంతో తన పాత్రకి తనే డబ్బింగ్ చెప్పుకోవాలనే ప్రయత్నంలో వుందిట. తెలుగు మాతృభాష అయిన మధుమిత డబ్బింగ్ చెప్పడానికి తమిళం బాగా నేర్చుకుంటోందిట.**



చూడగానే ఆమె కళ్లు వర్షించాయి. ఆపలేని తమకంతో అతనిని లేవదీసి తన హృదయానికి హత్తుకొని ''చందూ! చందూ! చందూ!'' అని పలవరిస్తూ అతని చెంపలమీద, నుదుటి మీద ముద్దులు కురిపించింది.

మగతగా అతడు కళ్లు తెరిచాడు. ఎర్రగా నిప్పుగడ్డల్లాగ ఉన్న అతని కళ్లలోకి క్రమంగా జీవం, వెలుగూ వచ్చాయి. ,

బగభగలాడుతున్న శరీరం క్రమంగా చల్లబడి చెమటలు పట్టాయి. ''మేడమ్ ! ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్! ఎవరైనా చూస్తే మీకే సమస్య'' అన్నాడు నీరసంగా.

ఆమె వెళ్లి తలుపు బార్లా తెరిచి కుర్చీ తెచ్చుకుని అతనికి దగ్గరగా కూర్చుంది. తల వంచుకొని తనలో తానే మాట్లాడుకుంటున్నట్లు ''యాక్సిడెంట్‌లో నువ్వు చనిపోయావని డాడీ చెప్పారు. స్థానిక పత్రికలో వచ్చిన యాక్సిడెంట్ వివరాలు, నీ ఫోటోతో సహా చూపించారు. అప్పుడే నేనూ చావాలనుకున్నాను. అమ్మ అడ్డు పడింది. పెళ్లిచూపుల్లోనే పెళ్లి ఇష్టం లేదని జగదీశ్‌కి చెప్పేశాను. కానీ ఆస్తికి ఆశపడి వాడు నాకు మూడు ముడులూ బిగించాడు. నన్ను ముట్టుకున్న మరుక్షణం చస్తానని, డబ్బు తీసుకొని భర్తలాగ నటిస్తూ పడి ఉండమని శోభనం నాడే అతనికి చెప్పేశాను. అలాగే ఉంటున్నాడు'' అంది.

ఇంజెక్షన్ ప్రభావం వల్లనో, నీహారిక పక్కన ఉండడం వల్లనో చంద్రమోహన్ జ్వరం తగ్గిపోయింది.

ఓపిక వచ్చింది. మంచం మీద లేచి కూర్చున్నాడు. ఎంతో మాట్లాడాలని ఉన్నా అణచుకున్నాడు.

''చందూ! నిజం చెప్పు! నీకు యాక్సిడెంట్ చేయించి పేపర్‌లో నీ ఫైల్ ఫోటోతో బాటు న్యూస్ వేయించింది మా డాడీయే కదూ?'' తీవ్రంగా అడిగింది.

ఆ తీవ్రతకు విస్తుపోయిన చంద్రమోహన్ ''అదంతా ఇప్పుడెందుకు? గతం తవ్వుకునే వారికి భవిష్యత్తు ఉండదు రిక్కీ'' అన్నాడు మృదువుగా.

నీహారికను కొందరు నీహా అని, మరికొందరు హారికా అని పిలిచినా చందూ ఒక్కడే రిక్కీ అని పిలుస్తాడు. ఆ పిలుపెంతో తియ్యగా ఆత్మీయంగా వినిపిస్తుందామెకు.

అతని ముఖం మీది చెమటను తన చెంగుతో తుడుస్తూ ''గతాన్ని మరిచిపోతే జీవితానికి అర్థమే ఉండదు చందూ! నిజం చెప్పు. తట్టుకోగలనులే'' అంది.

ఇంక చెప్పక తప్పలేదు చందూకి.

నీహారిక అనుమానం నిజమే. అయితే చందు చనిపోలేదు.

ఆ రాత్రి వెనక నుంచి వస్తున్న ట్రక్ అతని మీద నుంచి దూసుకుపోగా కొన ఊపిరితో నడిరోడ్డు మీద చావుబతుకుల మధ్య విలవిల్లాడుతున్న అతనిని ఒక పుణ్యాత్ముడు ఆసుపత్రిలో చేర్పించాడు. నుజ్జు అయిన అతని కాలూ, చెయ్యీ తీసివేయవలసి వచ్చింది. గాట్లు, మచ్చలతో ముఖం గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది.

ఆ దురవస్థ చూడలేక కన్నతల్లి గుండె ఆగి చనిపోయింది.

అతడు ఆరోగ్యం పుంజుకొని ఒంటికాలుతో నడవడం నేర్చుకున్నాక స్థానిక పత్రిక సంపాదకున్ని కలిసి తను చనిపోయినట్లు ఏ పత్రికలోనూ రాలేదు. మరి మీరెలా ప్రచురించారు, తన ఫైలు ఫోటో ఎవరిచ్చారని నిలదీశాడు. కేసు పెడతానని బెదిరించాడు.

అప్పుడు నీహారిక తండ్రి పథకం బయటపడింది.

మరో రెండేళ్లకు తండ్రి కూడా చనిపోగా అనాథగా మిగిలాడు చందు.

కీడులో మేలు అన్నట్లు వికలాంగుల కోటాలో సిరమిక్ కంపెనీలో అట్టే శ్రమ పడనక్కరలేని మేస్త్రీ ఉద్యోగం దొరికిందతనికి.

చందూ పరిస్థితికి డాడీయే కారణం అని రూఢి అయ్యాక నీహారిక హృదయం భగభగ మండిపోయింది. అనుమానంతో ఆమె ఇప్పటికే డాడీతో మాట్లాడ్డం మానేసింది.

జగదీశ్‌ని డాడీ వద్దకు తగిలేసింది. అతగాడు జలగలాగ పీల్చేసి ఏదో కేసులో ఆయన్ని ఇరికించేస్తాడు.

అప్పుడు గాని ఆయనకు తను సెలెక్ట్ చేసుకున్న అల్లుడి అసలు స్వరూపం అర్థం కాదు.

ఇప్పుడు డాడీ చేసిన నేరం రూఢి అయింది కాబట్టి ఏ శిక్ష విధించాలి?

చెడామడా తిట్టి లెంపలు వాయగొట్టాలా?

జైలులో పెట్టించాలా?

ఆమె అలా ఆలోచిస్తూ ఉండగానే-

''పగ, ప్రతీకారాలతో రగిలిపోకు రిక్కీ! ఆ మంట నిన్నే దహించివేసి మనశ్శాంతి లేకుండా చేస్తుంది. మీ డాడీ వల్ల కష్టాలూ నష్టాలూ పడ్డ నాకే ఆయనంటే ద్వేషం లేదు. రగిలిపోయి, కుమిలిపోయి చావవలసిన నన్ను మన ప్రేమే రక్షించింది! నిజం రిక్కీ! నువ్వు గొప్ప డాక్టరువై అందరూ నిన్ను పొగుడుతూ ఉంటే చూడాలన్న కోరికే నన్ను ప్రాణాలతో నిలిపింది. ఎక్కడో ఓ చోట నువ్వు సుఖంగా ఉన్నావన్న భావనే నాకు అనుదినం జీవం పోసేది. రాత్రి నిద్రపోయేటప్పుడు నా రిక్కీని ఒక్కసారి చూపించమని దేవున్ని కోరుకునే వాడిని. ఆ దేవుడే పంపినట్లు నువ్వు వచ్చి ఇక్కడ ఆసుపత్రి ప్రారంభించావు. అందరూ నిన్ను పొగుడుతుంటే నాకెంత ఆనందంగా ఉందో తెలుసా? నీలాగ నేను కూడా పగ, ప్రతీకారాలతో రగిలిపోతే ఎప్పుడో చనిపోయే వాడిని! నిన్ను చూడగలిగే వాడిని కాను! ఈ ఆనందాన్ని మిస్ అయ్యేవాడిని'' డగ్గుత్తికతో అన్నాడు చందు.

అతడు మాట్లాడుతూనే ఉన్నాడు.

అతని కళ్లలో కాంతి! ప్రేమకాంతి!

అతని ముఖంలో దివ్యత్వం! ప్రేమ దివ్యత్వం!

అతని చేతిని తన చేతిలోకి తీసుకొని మృదువుగా నిమురుతూ కన్నీళ్లు నిండిన అంతలేసి కళ్లతో అతనినే చూస్తూ ఉండిపోయింది నీహారిక.

''అందరి జీవితాలూ కష్ట కార్పణ్యాలు, కోపతాపాలు, పగప్రతీకారాలతో రగిలిపోయే ఎడారులే రిక్కీ! ఈ ఎడారుల్ని పెరగనివ్వకూడదు. పెరగనిస్తే ప్రపంచమే ఒక పెద్ద ఎడారిగా మారి మానవ మనుగడ కష్టం అవుతుంది. అందుకే ఆ ఎడారుల్లో ప్రేమ ఒయాసిస్సులు సృష్టించుకోవాలి. మమతల ఖర్జూరం చెట్లు నాటుకోవాలి. మానవతా మాధుర్యాలు అందరికీ పంచాలి.'' అతడు అంటూ ఉండగానే-

చటుక్కున వంగి అతని పెదవులపై చుంబించి ''అలాగే చందూ! నవ్వు చల్లని వెన్నెల వెదజల్లి అందరికీ ఆహ్లాదం పంచుతున్నట్లే నీ అడుగుజాడల్లో మన ప్రేమ బాట మీద నడుస్తూ అందరికీ మధురిమలు పంచుతాను'' అంది నీహారిక ఆర్తిగా.

☆

